క్లుప్తంగా

బోనమెత్తిన ఎమ్మెల్యే హరిప్రియ



బోనంతో వస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: మండలంలోని మంగలితండాలో సోమవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పాల్గొని స్థానిక మహిళలతో కలిసి బోనమెత్తారు. బొడ్రాయి, ముత్యాలమ్మ గుడి వద్ద ప్రదక్షిణలు చేశారు. మొక్కులు చెల్లించి పూజలు చేశారు. సర్పంచ్ బానోత్ ప్రియాంక, ఎంపీటీసీ భూక్యా బాలకృష్ణ, ఉప సర్పంచ్ రాజేశ్, బానోత్ రామ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ రూ.లక్ష రుణం ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీకి రూ.లక్ష రుణం ఇవ్వాలని సీపీఐ నాయకుడు వై.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పథకాన్ని ఎలాంటి అవకతవకలు లేకుండా అమలు చేయాలని కోరారు. ఆర్థిక స్థోమత లేకపోవడం వల్లనే బీసీ వర్గాలు తమ వృత్తులను వదిలి ఇతర పనులకు వెళ్తున్నారని తెలిపారు. సమావేశంలో కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నెరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ కాలనీలో నీటి ఎద్దడికి చెక్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఓల్డ్ కాలనీలో కొద్ది రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. అక్కడి బోరు దెబ్బతినడంతో తాగునీటి ఇబ్బంది ఏర్పడింది. టీబీజీకేఎస్ నేత రంగనాథ్ సమస్యను జీఎం జాన్‌ఆనంద్‌కు వివరించగా వెంటనే ఆయన స్పందించారు. అధికారులను సమన్వయం చేసి బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి, నీటిని అందించారు. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

జీజేసీ విద్యార్థుల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ కత్తి రమేశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ధర్మసోత్ సింహాద్రి, జి.కార్తీక్ ఎ.మిత్‌వరుణ్, వి.తన్విక్, బి.హర్షిత ఉత్తమ ప్రతిభ చూపి మంచి కళాశాలల్లో సీట్లు సాధించారని చెప్పారు. అనంతరం లెక్చరర్లు బండి వెంకటేశ్వరరావు, సాయినాథ్, హసీనాతోపాటు ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు.

అర్హులందరికీ బీసీ రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచ: అర్హులైన కార్పెంటర్లకు బీసీ రుణాలు అందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ, మండల కార్పెంటర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఫారెస్ట్ టింబర్ డిపోల ద్వారా సబ్సిడీపై కర్ర సరఫరా చేయాలని, అర్హులైన వారందరికీ గృహలక్ష్మి పథకం అమలు చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వైకుంఠనాథం, అద్దంకి జోగేశ్వరాచారి, కాసర్ల కృష్ణమాచారి, సంగోజు వెంకటేశ్వర్లు, కాసర్ల నాగేశ్వరరావు, వెంకటాచారి, వీరాచారి, రమేశ్, బ్రహ్మం, శ్రీనివాసాచారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అవగాహన సదస్సు

జూలూరుపాడు: పడమటనర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పదిరోజులుగా జరుగుతున్న వాయిస్ ఫర్ గర్ల్స్ అవగాహన సదస్సు సోమవారం కూడా కొనసాగింది. జీసీడీఓ అలివేలు మంగమ్మ, ఏటీడీఓ రూపాదేవీ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఏజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుభద్రమ్మ మాట్లాడుతూ బాలికలు చైతన్యవంతమైతే ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యం, భద్రత, హక్కులు, భవిష్యత్ కార్యాచరణ అనే అంశాలను తెలుసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు, ఆర్థిక, సామాజిక, లింగ అసమానతల నిర్మూలన తదితర అంశాలపై ఫీల్డ్ కోఆర్డినేటర్లు కీర్తి, ఖ్యాతి అవగాహన కల్పించారు.

భద్రతపై ప్రత్యేక నజర్

- జెన్‌కో సౌజన్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి
- ట్రాఫిక్ పర్యవేక్షణకు కూడళ్లలో సిబ్బంది నియామకం
- నేరాల నియంత్రణకు అవగాహన సదస్సులు



ట్రాఫిక్ సిబ్బంది కోసం కూడలిలో ఏర్పాటు చేసిన స్టాండ్

పాల్వంచ: కొత్తగూడెం – పాల్వంచ జంట పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యాన భద్రత చర్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నేరాలకు పాల్పడకుండా, నేరస్తుల చేతిలో మోసపోకుండా అవగాహన కల్పించడమే కాక ట్రాఫిక్ నియంత్రణ, కేసుల దర్యాప్తునకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో 120 వరకు సీసీ కెమెరాలు ఉండగా అవి కోతులు, వర్షాలు ఇతర కారణాలతో సగం మేర పనిచేయడం లేదు. ఇంకా కొన్ని చోట్ల సీసీ కెమెరాల అవసరముందని డీఎస్పీ వెంకటేశ్, సీఐ వినయ్‌కుమార్ గుర్తించారు. ఈ విషయాన్ని జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10 లక్షల నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. జెన్‌కో సౌజన్యంతో త్వరలోనే కేటీపీఎస్ కాలనీలతో పాటు పట్టణంలో అవసరమైన చోట్ల కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తద్వారా నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టడమే కాక నేరాలు జరిగినప్పుడు నిందితుల గుర్తింపు సులభమవుతుందని భావిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కొత్తగూడెం నుంచి భద్రాచలం జాతీయ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రహదారిలో వాహనాల నియంత్రణ సరిగా లేక ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇలాంటి ఘటనల్లో పలువురు గాయపడగా.. కొందరు మృత్యుఒడికి చేరారు. దీంతో ప్రమాదాల నివారణతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బస్టాండ్‌సెంటర్, అంబేడ్కర్‌సెంటర్, దమ్మపేటసెంటర్లలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు. వారి కోసం కంట్రోల్ స్టాఫ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్ (ఫైల్)

నేరాలపై అవగాహన సదస్సులు

నేరాలకు పాల్పడకుండా ఉండటం, ఒకవేళ పాల్పడితే ఎదురయ్యే పరిణామాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆటోడ్రైవర్లు, టీనేజర్లు, విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నారు. అనేక మంది అతివేగం, హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించి ఆయా అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, పోకిరీల నుంచి ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇచ్చేలా విద్యార్థినుల్లో చైతన్యం కలిగేలా వివరిస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు



ప్రజల్లో చైతన్యం వస్తేనే నేరాలు, ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని భావించి విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అలాగే, యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి సారించేలా సూచనలు చేస్తున్నాం. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం.

–వినయ్‌కుమార్, సీఐ, పాల్వంచ

జీపీ కార్మికుల భిక్షాటన



టేకులపల్లి: భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు



ఇల్లెందురూరల్: భిక్షాటన చేస్తున్న కార్మికులు

టేకులపల్లి: జీపీ కార్మికుల సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరింది. మండల కేంద్రంలో కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. మండల జేఏసీ చైర్మన్ మూడు బిచ్చు, కత్తుల ఎర్రయ్య, గుంటి భాస్కర్, వెంటాచారి, అశోక్, వెంకటేశ్వర్లు, మహేశ్, బోడ ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం పంచాయతీ కార్మికులు గ్రామాల్లో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో సారంగపాణి, యాకూబ్‌షావలి, జటంగి వెంకన్న, మోహన్‌రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో వంటావార్పు

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు సోమవారం శిబిరం వద్ద వంటావార్పు నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాకేశ్, కార్మికులు రెడ్డిమల్ల భిక్షం, చంచలపురి శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, భద్రు, నవీన్, తులసీరాం, చిట్టిబాబు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: వంటావార్పు అనంతరం భోజనం చేస్తున్న కార్మికులు

పారిశుద్ధ్య పనులను అడ్డుకున్న కార్మికులు



ట్రాక్టర్ ఎదుట బైఠాయించిన కార్మికులు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం ప్రతినిధులు సోమవారం అడ్డుకున్నారు. పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో చెత్త పేరుకుపోవడంతో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసుకున్న కూలీల సహాయంతో చెత్తను ట్రాక్టర్‌లోకి చేరుస్తున్న విషయం తెలుసుకున్న కార్మికులు హుటాహుటిన అక్కడకు చేరుకొని పంచాయతీ ట్రాక్టర్ ఎదుట బైఠాయించారు. పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, తర్వాత కార్మికులను నియమించుకోమని కార్యదర్శి హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సారంగపాణి, రాంసింగ్, సామేలు, నర్సింహారావు, కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న ప్రతిపక్షాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని, అది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని, అభివృద్ధికి అడ్డుపడుతున్న ప్రతిపక్షాలకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణ రైతు బిడ్డల కోసం ప్రభుత్వం ఎంతగా కష్టపడుతుందో అందరికీ తెలుసని, దేశంలో ఏరాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని, పోరాటాల బీఆర్ఎస్‌కు ఎవరూ సాటిరారని పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణానికి రూ.115 కోట్లు, పాల్వంచ పట్టణానికి రూ.100 కోట్లు మంజూరు చేశామని, టెండర్లు కూడా పూర్తి కావొచ్చాయని, త్వరలోనే పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తామని వెల్లడించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సుమారు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, దామోదర్ పాల్గొన్నారు.

హక్కులు అడగటం తగదు

టేకులపల్లి: ఏజెన్సీలో గిరిజనేతరులు హక్కులు అడగటం రాజ్యాంగ విరుద్ధమని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి దుగ్గారపు వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు, ఇతర సదుపాయాలు, ఏజెన్సీ చట్టాలు అన్నీ గిరిజనులకే వర్తిస్తాయని, వీటిపై గిరిజనేతరులు హక్కులు అడగటం సరికాదని, కొందరు గిరిజనేతరులు స్వార్థ రాజకీయాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీలో సర్వ హక్కులు, అధికారం గిరిజనులకే ఉంటుందని స్పష్టం చేశారు. ఏజెన్సీలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోగా గోవర్ధన్, గొగ్గల అశోక్, వట్టం నాగేంద్ర, నరేందర్, సాయి, నాగేశ్, నాగయ్య, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంతాలకు తరలించాలి..

గిరిజనేతరులను మైదాన ప్రాంతాలకు తరలించాలని తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలోని నియమ నిబంధనలు ఆర్‌ఓఎఫ్‌ఆర్–2006 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంపై, అడవిపై పూర్తి హక్కులు గిరిజనులకే ఉంటాయన్నారు. 1/70, పీసా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు మాట్లాడటం రాజకీయ లబ్ధికోసమేనని చెప్పారు. గిరిజనేతరుల చేతిలో ఉన్న పోడు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మధు, రామస్వామి, కుమార్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తొమ్మిదేళ్లలో ఒరిగిందేమీ లేదు..




మాట్లాడుతున్న ఆకుల నాగేశ్వరరావుగౌడ్

సుజాతనగర్: రూ.లక్ష రుణాల జాబితాను ఎమ్మెల్యేలు ఖరారు చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావుగౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సుజాతనగర్‌లో సోమవారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.లక్ష రుణాలను బీఆర్ఎస్ కార్యకర్తలకు, నచ్చినవారికే ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. బీసీలందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే కొన్ని కులాల వారికే రుణాలు పరిమితం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో భూక్యా రాజేశ్‌నాయక్, ఎస్‌కే ఖాసీం, ఉబ్బనపల్లి వినీల్‌కుమార్, నరసింహారావు, చింతాల శంకర్‌యాదవ్, చల్లా వెంకటేశ్, గడ్డం పూర్ణ, సురేశ్, సైదా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇల్లెందు: మండలానికి చెందిన పలువురు టీడీపీ, బీఆర్ఎస్‌లకు చెందిన 20 మంది నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చీమల వెంకటేశ్వర్లు నేతృత్వంలో ముకుందాపురం ఏరియాకు చెందిన ధనియాకుల బాబు, కేశవులు, సూర్నబాక వెంకటేశ్వర్లు, పూనెం రాజు, వజ్జ వీరస్వామి, కల్తీ పాపారావు, వజ్జ సందీప్, వర్సా మల్లయ్య, గులగట్టు వెంకన్న, గోనేబోయిన సతీశ్, వీరబోయిన కుమార్, గుగ్గిళ్ల లక్ష్మయ్య, రాజారావు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

బీఎస్పీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

సుజాతనగర్: బీఎస్పీతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి సీతంపేట బంజర గ్రామంలో సోమవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, గుండేటి ఆదినారాయణ, గుగులోత్ రాంబాబు, అజ్మీర రాజేశ్, కల్యాణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పాల్వంచరూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గద్దల రమేశ్ కోరారు. మండలంలోని దందలబోరు, బంద్రుగొండ, దంతలబోరుఎస్సీకాలనీలో సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రూపు రాజకీయాలు చేయకుండా టికెట్ ఎవరికి వచ్చినా ఐక్యంగా పనిచేసి పార్టీని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో చారి, జోషి, ప్రసాద్, రాము, సతీశ్, రమేశ్, పిచ్చిరెడ్డి, పెద్దరెడ్డి, గణేశ్, మోహన్‌రెడ్డి, కొర్ల రాజు, లక్ష్మణ్, రాజు, నవీన్, పెద్దవెంకన్న పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

కొత్తగూడెంరూరల్: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో పాత పెన్షన్ విధానం సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ హెచ్‌ఎం పద్మజ, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్‌ఎం రాణి, ఆశ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

కూలిన పోలీస్ స్టేషన్ ప్రహరీ

పాల్వంచ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ప్రహరీ కూలిపోయింది. పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన ప్రభుత్వ ఆస్పత్రి రోడ్‌లో ప్రహరీ వర్షాలకు నానిపోయి ఒక్కసారిగా కొంత భాగం కూలిందని స్థానికులు తెలిపారు. దశాబ్దాల కిందట నిర్మించిన గోడ కావడంతో కూలినట్లు తెలుస్తోంది.

రైతులకు సబ్సిడీపై అవగాహన

జూలూరుపాడు: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో సోమవారం గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంఘం (ఆర్‌ఏడీఎస్) ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఏడీఎస్ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ రామకృష్ణ రాజు మాట్లాడుతూ రైతాంగానికి విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీపై ఆర్‌ఏడీఎస్ ద్వారా అందించనున్నట్లు చెప్పారు. డబుల్ బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఆర్‌ఏడీఎస్‌లో సభ్యులుగా రైతులు చేరితే విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీపై ఇస్తారని తెలిపారు. మార్కెటింగ్ డైరెక్టర్ శివప్రసాద్, సీఈఓ ప్రియాంక, మార్కెట్ మేనేజర్ శ్రీధర్, అకౌంటెంట్ జగదీశ్, జూలూరుపాడు క్లస్టర్ మేనేజర్ నగేశ్, రైతులు లాలు, భద్రు, శ్రీను, రాంబాబు, హనుమా, నరసింహ, ధర్మా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ రాజు

రైతులను మోసం చేస్తున్న పాలకులు



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: రైతులను మాయమాటలతో పాలకులు మోసం చేస్తున్నారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఆరోపించారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో అన్ని సర్వేలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయని, దీంతో కేసీఆర్‌కు భయం పట్టుకుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు, రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, త్యాగరాజన్, శనగల లక్ష్మణ్, లౌడ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తగూడెంటౌన్: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కొత్తగూడెం 29వ వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్ అన్నారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 29 వార్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తంగెళ్ల లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు తొలినుంచి పౌష్టికాహారం పెట్టాలని, తద్వారా వారు చురుగ్గా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ భాగ్యలక్ష్మి, ఆయా సంతోషి చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తొలగించేది ఎవరు?



టేకులపల్లి సెంటర్‌లోని ప్రధాన రహదారి జంక్షన్ మధ్యలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద సుమారు రెండేళ్ల కిందట డివైడర్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం నిర్మించారు. సుమారు 15 రోజుల కిందట ఓ గుర్తు తెలియని లారీ ఢీకొట్టిపోయింది. దీంతో శిలాఫలకం దిమ్మె కూలిపోయింది. వైఎస్సార్ విగ్రహం వద్దకు వెళ్లే మెట్లు కూడా విరిగాయి. కూలిపోయిన శిలాఫలకాన్ని అక్కడి నుంచి తొలగించకపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ కేటీసీకి బొగ్గు కోసం వందల సంఖ్యలో లారీలు, టిప్పర్లు వెళ్తుంటాయి. ఈ రాకపోకల నేపథ్యంలో జంక్షన్ మధ్యలో శిలాఫలకం దిమ్మె ఉండటం ట్రాఫిక్‌కు అంతరాయంగా మారింది. అధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న శిలాఫలకం దిమ్మెను అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 92814 79238